క్లుప్తంగా

క్రీడాసామగ్రి వితరణ



వాలీబాల్, నెట్లను అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యుడు

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు లయన్స్ క్లబ్ మంగళవారం క్రీడాకారులకు వాలీబాల్, నెట్‌లను అందజేసింది. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 1, 2వ తేదీలలో వాలీబాల్ టోర్నీ నిర్వహిస్తున్నట్టు జిల్లా క్రీడావిభాగం అధ్యక్షుడు మహమ్మదాలీ తెలిపారు.

నవ ధాన్యాల పంటలతో అధిక ఆదాయం



మామిడి తోటలో నవధాన్యాల పంటలను పరిశీలిస్తున్న వాసు

రొంపిచెర్ల: నవధాన్యాల పంటల సాగుతో రైతులు అధిక ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు అన్నారు. రొంపిచెర్ల గ్రామ పంచాయతీ వారణాసివారిపల్లెకు చెందిన యమున మామిడి తోటలో సాగు చేసిన నవధాన్యాల పంటలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, మామిడి తోటలో మూడేళ్ల నుంచి ఈపీఎండీఎస్ పద్ధతిలో నవధాన్యాల పంటలు సాగు చేయడం వలన మామిడి పంట దిగుబడి కూడా పెరిగిందన్నారు. అలాగే 20 రకాల నవధాన్యాల పంటల సాగుతో మంచి ఆదాయం పొందారని అభినందించారు. ఈ పంటను పశువులకు మేతగా కూడా వాడుకోవచ్చని, దీని వలన పాలలో వెన్న శాతం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంటీ రమేష్, పీఆర్‌పీ రెడ్డెమ్మ, కోమల, అనంతలక్ష్మి, సుధారాణి, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 2న 'అనంత'లో కాపునాడు మహాసభ



కాపునాడు ప్రతినిధులు

గంగవరం: నవంబర్ 2న అనంతపురంలో నిర్వహించనున్న కాపునాడు జోనల్ స్థాయి మహాసభను జయప్రదం చేయాలని పలమనేరు నియోజకవర్గ కాపునాడు ప్రతినిధులు మంగళవారం పిలుపునిచ్చారు. ఈ మహాసభకు రాయలసీమ నుంచి బలిజ, కాపులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో కాపునాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు సోమశేఖర్ నాయుడు, రాష్ట్ర సయుక్త కార్యదర్శి డాక్టర్. జనార్ధన్, రెడ్డిభాస్కర్, హరి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అవగాహన సదస్సులు

సదుం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అక్టోబర్ 1, 3వ తేదీలలో రైతులకు వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసినట్లు ఏఓ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పిస్తామన్నారు. వ్యవసాయ పనిముట్లు, డ్రిప్, స్ప్రింకర్ల, పశుసంవర్ధక శాఖ పనిముట్ల ప్రదర్శన ఉంటుందని,. రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

6న వాహనాల వేలం

కుప్పం: వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను ఈ నెల 6న వేలం వేస్తున్నట్లు కుప్పం ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సీఐ నాగరాజు తెలిపారు. ద్విచక్రవాహనాలు, నాలుగు చక్రాల వాహనాలు వీటిల్లో ఉన్నాయని, వేలంలో పాల్గొనే వారు తమ కార్యాలయంలో నిర్ణీత రుసుం చెల్లించి టోకెన్ పొందాలని, వేలంలో వాహనాలు దక్కించుకున్న వారు చలానా రూపేణా మొత్తం చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ఉలవలైనా ఇవ్వండి సారూ..!



వానకోసం ఎదురుచూస్తున్న దుక్కులు



బీళ్లుగా మారిన మెట్ట భూములు

- వేరుశనగ సాగుకు కరుణించని వరుణుడు
- బీడుగానే 90శాతం మెట్టభూములు
- ప్రత్యామ్నాయంగా ఉలవల కోసం రైతన్నల ఎదురుచూపు

వేరుశనగ విత్తనకాయలకు సంబంధించిన వివరాలు

నియోజకవర్గంలో సాధారణ సాగు విస్తీర్ణం	: 12వేల హెక్టార్లు
ఈ పర్యాయం సాగైన వేరుశనగ సాగు	: 750 హెక్టార్లు
ప్రస్తుతం రైతులకు కావాల్సిన ఉలవ విత్తనాలు	: 800 క్వింటాళ్లు

పలమనేరు: ఈ ఖరీఫ్ సీజన్‌లో వర్షాధారంగా పలమనేరు నియోజకర్గంలో ఎక్కువమంది సాగుచేసే పంట వేరుశనగ. మెట్ట భూములున్న రైతులకు ఇదే ఆధారం. సాధారణంగా జూలై తొలి వారానికల్లా ఇక్కడ వేరుశనగ విత్తనాలేసే పనులు పూర్తికావాలి. కానీ ఇప్పటివరకూ వరుణుడు కరుణించకపోవడంతో చేలల్లో విత్తనాలు పడలేదు. కేవలం దాదాపు పది శాతం వేరుశనగ పంట మాత్రమే కనిపిస్తోంది. దీంతో 90 శాతం మెట్టభూములు బీడుగానే దర్శనమిస్తున్నాయి. కనీసం ఉలవ విత్తనాలనైనా సబ్సిడీ ధరకు పంపిణీ చేయాలని రైతన్నలు కోరుతున్నారు.

30 ఏళ్లలో ఎప్పుడూ ఇలా లేదు

సాధారణంగా వేరుశనగ విత్తనాలకు జూన్ 15 నుంచి జూలై తొలివారంలోగా చేలల్లో వేయాలి. ఈ సీజన్‌లో వేస్తేనే పంట దిగుబడి వస్తుంది. అయితే అప్పట్లో వర్షాలు పడలేదు. దీంతో 90 శాతం పైగా చేలు బీళ్లుగానే ఉన్నాయి. సీజన్ ముగిసిన తర్వాత వర్షాలు కురిసినా ఫలితంలేకుండా పోయింది. గత 30 ఏళ్లలో వర్షాలు పడని సీజన్ ఇదేనని వృద్ధులు చెప్పారు.

ప్రత్యామ్నాయంగా ఉలవలే శరణ్యం

ఎలాగూ వేరుశనగ పంట సాగులేదు కాబట్టి ఆ చేలల్లో ఉలవలైనా సాగు చేసుకునేందుకు ఇప్పుడు అనుకూలంగా ఉంది. ఎలాగూ అక్టోబరులో ఈ పంట సీజన్ మొదలుకానుంది. ఈ విషయం స్థానిక వ్యవసాయ అధికారిణి సంధ్యారాణిని వివరణ కోరగా.. మండలాల వారీగా ఉలవలకోసం ఇప్పటికే ఇండెంట్ పెట్టామన్నారు. అవి అందాక రాయితీపై రైతులకు పంపిణీ చేస్తామన్నారు. అయితే ఉలవలు ఎప్పుడు అందుతాయనే సమాచారం ఉన్నతాధికారుల నుంచి రావాల్సి ఉందన్నారు.

పెద్దిరెడ్డి కుటుంబంపై బురద చల్లితే సహించం

- ఎంపీ మిథున్‌రెడ్డికి బెయిల్ మంజూరుపై హర్షం
- అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం



అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం అనంతరం మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రొంపిచెర్ల: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబంపై కూటమి నాయకులు రాజకీయంగా బురద చల్లడం ఇకనైనా మానుపోవాలని జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్ రెడ్డి హితవు పలికారు. అక్రమ మద్యం కేసులో ఎంపీ మిథున్ రెడ్డికి బెయిల్ మంజూరు కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ, మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబాన్ని దెబ్బ తీయాల లేని మద్యం కుంభకోణం సృష్టించి, వైఎస్సార్‌సీపీ నాయకులను అక్రమ అరెస్టులు చేయించారని మండిపడ్డారు. వీళ్లెంతగా స్కెచ్ వేసినా మద్యం కేసులో ఎంపీ మిథున్ రెడ్డి పాత్ర లేదని కోర్టు గుర్తించడం కూటమి ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదేనని గుర్తెరగాలన్నారు. మద్యం విక్రయాల్లో అధికార ప్రభుత్వం ఎలా దోచుకుంటోందనే ప్రజలు ప్రత్యక్షంగానే చూస్తున్నారన్నారు. ఏ గ్రామంలో చూసినా విచ్చలవిడిగా బెల్ట్ షాపులు కనిపిస్తున్నాయని, మద్యం షాపుల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని విమర్శించారు. అధికారులు కూడా కూటమి నాయకులకు తొత్తులుగా పనిచేయడం తగదన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఎక్కడ అన్యాయం జరిగినా డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలని పిలుపునిచ్చారు.

పోలీసుల ఆంక్షల నడుమ పాలాభిషేకం

మిథున్‌రెడ్డికి బెయిల్ మంజూరుపై హర్షం వ్యక్తం చేస్తూ అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసేందుకు బయల్దేరిన పార్టీ నాయకులకు పోలీసులు ఆంక్షలు విధించారు. కార్యక్రమంలో 10 మంది పైచిలుకు ఎవరూ ఉండరాదని హెచ్చరించారు. దీనిపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కోటా వెంకటరమణ, కరీముల్లా, శ్రీనాథనాయుడు, శంకర్‌రెడ్డి, సురేంద్రనాయుడు, అమరనాధరెడ్డి, కె.రవీంద్రనాథ రెడ్డి, మహబూబ్‌బాషా, సిద్ధరామిరెడ్డి, ఓబులేసు, రాజాసాహెబ్, సుధాకర్ రెడ్డి, కుమార్ నాయుడు, గురు, బావాజి, మంజూర్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి కుట్రలకు ఇక భయపడేది లేదు



కొలింపల్లె క్రాస్‌లో రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పించి ఎంపీ మిథున్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

- కొలింపల్లె క్రాస్‌లో మిథున్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

చౌడేపల్లి: కూటమి ప్రభుత్వం బనాయించిన అక్రమ కేసులనుంచి రాజంపేట ఎంపీ పీవీ.మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా బయటకొస్తారని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ జి. నాగభూషణరెడ్డి, మాజీ ఎంపీపీ రుక్మిణమ్మ, బోయకొండ ఆలయ మాజీ చైర్మన్ మిద్దింటి శంకర్ నారాయణ వ్యాఖ్యానించారు. అక్రమ లిక్కర్ కేసులో మిథున్‌రెడ్డికి బెయిల్ రావడంతో ఆ పార్టీ నేతలు సంబరాలు నిర్వహించారు. బాణసాచం పేల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. దిగువపల్లె పంచాయతీ కొలింపల్లె క్రాస్‌లో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కాంస్య విగ్రహానికి తొలుత పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం మిథున్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబంపై ఎల్లోమీడియా ద్వారా బురద చల్లడమే పనిగా పెట్టుకుందని, పార్టీ నేతలు, క్రియాశీలక కార్యకర్తలే లక్ష్యంగా దాడులు, దౌర్జన్యాలు చేయడం, కేసులు బనాయించడమే పనిగా పెట్టుకుందని విమర్శించారు. తప్పుడు కేసులకు దీటుగా సమాధానం చెప్పి ఎదుర్కొంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచులు సోని, షంషీర్, మండల పార్టీ ఉపాధ్యక్షులు లడ్డూ రమణ, వెంకటరమణ, సింగిల్‌విండో మాజీ చైర్మన్ రవిచంద్రారెడ్డి, నాయకులు జీఆర్‌ఎస్ రమణ, మునికృష్ణమనాయుడు, గంగిరెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి, ప్రసాద్‌నాయుడు, బ్రహ్మానందరెడ్డి, మోహన్‌యాదవ్, వెంకటరెడ్డి యాదవ్, రమేష్‌బాబు, చిన్నప్ప, నరసింహారెడ్డి, ఆనందరెడ్డి, నరేష్, గణేష్, డిష్ సూరి, గిరిబాబు, జమీల్‌బాషా, చంద్ర, బాలిరెడ్డి, చిన్నరెడ్డెప్పరెడ్డి, శ్రీనివాసులు, అనుప్రియ, యశోద, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

అనధికార లేఔట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు చేసుకోండి

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలోని అనధికార లేఔట్లను క్రమబద్ధీకరించుకునేందుకు వ్యాపారులు దరఖాస్తు చేయాలని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వాదేశాల మేరకు 2025 జూన్ 30 నాటికి రిజిస్టర్ అయిన అనధికార లేఔట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరణకు ఎల్‌ఆర్‌ఎస్ పథకం కింద 7శాతం ఓపెన్ స్పేస్, 10శాతం చార్జీలు చెల్లించి, 45 రోజులలోపు అపరాధ రుసుం చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకుతమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన

సదుం: హెచ్‌ఐవీ బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ దివ్య కోరారు. మండలంలోని నడిగడ్డలో మంగళవారం హెచ్‌ఐవీ, టీబీ వ్యాధుల సంక్రమణ, చికిత్స పద్ధతులపై ఆమె కరపత్ర ప్రచారంతో అవగాహన కల్పించారు. గర్భిణులు హెచ్‌ఐవీ బారిన పడితే తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అలాగే క్షయ బాధితులు క్రమం తప్పకుండా నిర్దేశిత మందులు, పోషకాహారం తీసుకుంటే వ్యాధి నుంచి విముక్తి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం సుజాత, పార్వతి, సోము పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం



మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడను కలిసిన వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం నాయకులు

పలమనేరు: కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యక్రమాలను ముమ్మరం చేస్తామని నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్ సీపీ ఎస్సీ నేతలు చెప్పారు. మంగళవారం పలమనేరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కో–ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడను వారు కలిశారు. అధికార పార్టీ ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి సొంత గ్రామమైన కెళవాతికి చెందిన ఏ.శ్రీనివాసులును వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శిగా నియమించినందుకు కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను ప్రజలకు చాటిచెబుతామని, డిజిటల్ బుక్‌ను పెద్దసంఖ్యలో డౌన్‌లోడ్ చేసుకునేలా చూస్తామన్నారు. అనంతరం ఆయన్ను సన్మానించారు. పలు మండలాల వైఎస్సార్‌సీపీ ఎస్సీసంఘ నేతలు పాల్గొన్నారు.

పట్టుబడినతనే చోరీ చేశాడు!

చౌడేపల్లి: మండలంలోని 29 ఏచింతమాకులపల్లెకు చెందిన ఆర్.మునిరాజ గత రెండేళ్లుగా ఏడుగురి ఇళ్లల్లో దాచి న బంగారు నగలు, నగదు చోరీ చేశాడని మంగళవారం బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం.. చింతమాకులపల్లెలో ఈ నెల 21న రమాదేవి ఇంట్లోని బీరువాలో దాచిన 17 గ్రాముల బంగారు నగలు, రూ.50 వేల నగదు చోరీ అయ్యాయి. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆపై అదే గ్రామానికి చెందిన గ్రామ పెద్దలు కృష్ణప్ప, వేణుగోపాల్‌రెడ్డి వద్ద మునిరాజ నేరం అంగీకరించాడు. తర్వాత గుట్టు చప్పుడు కాకుండా బాధితురాలు రమాదేవికి నగలు, సొమ్మును అప్పగించేశారు. అయితే గత రెండేళ్లుగా మునిరాజ అదే గ్రామంలో ఆర్.వరలక్ష్మికి చెందిన రూ.5వేలు, ఎం.వీరభద్ర వద్ద రూ.20 వేలు, కె.మునిరాజ రూ.70 వేలు, మునివెంకటప్ప వద్ద రూ.35 వేలు, ఎస్.నన్నేసాబ్ వద్ద రూ.16 వేలు, శంకరప్ప వద్ద 70 గ్రాముల బంగారు, బిల్లేరుగాని ఇండ్లకు చెందిన గంగరాజు వద్ద రూ.45 వేల నగదును చోరీ చేశాడు. గ్రామంలో కొంతమంది అండతోనే చోరీ వ్యవహారం సాగుతోందని ఆరోపణలు ఉన్నాయి. పోలీసులు విచారణ చేసి న్యాయం చేయాలని బాధితులు కోరారు.

క్షీర కలశాల శోభాయాత్ర



ఊరేగింపుగా వస్తున్న జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

వి.కోట: దుర్గాష్టమి పురస్కరించుకుని మంగళవారం వేలాదిమంది మహిళలతో నిర్వహించిన క్షీర కలశాలతో శోభాయాత్ర వి.కోట వీధులు భక్తజన పారవశ్యంతో మునిగాయి. ఊరేగింపుగా వచ్చిన అమ్మ వారికి క్షీరాభిషేకం చేశారు.అమ్మవారి దీవెనలు అందరిపై ఉండాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ మొక్కారు. ఊరేగింపులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ సోమశేఖర్ రెడ్డి బందోబస్తు కల్పించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

ఆలయ ప్రాంగణంలో భక్తి, జానపద గేయాలకు కళాకారులు, చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు, భరతనాట్యం, కోలాటాలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబరిచిన కళాకారులకు జెడ్పీ చైర్మన్ చేతుల మీదుగా జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. ఆలయ ధర్మకర్త దామోదర్‌రెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



కళాకారులకు బహుమతులు ప్రదానం చేస్తున్న జెడ్పీ చైర్మన్



నేతలను సత్కరిస్తున్న ఆలయ కమిటీ

రికార్డులు టాంపరింగ్ చేసి లోను మంజూరు..!



బాధితురాలు భారతి



భారతి పేరిట ఉన్న రికార్డుల్లో పెన్నుతో భవానిగా దిద్దిన దృశ్యం

చౌడేపల్లి: మహిళా స్వయం సహాయక సంఘం రికార్డులు తారుమారు చేసి ఓ మహిళా సభ్యురాలిని సంఘం నుంచి తొలగించారు. ఏకంగా ఆమె పేరిట, వివరాలతోనే బ్యాంకు లింకేజీ సైతం మంజూరు చేయించి, మరొక మహిళకు లోను పొందిన ఉదంతం మండలంలోని దుర్గసముద్రంలో వెలుగులోకి వచ్చింది. బాధితురాలి కథనం మేరకు..గ్రామానికి చెందిన భారతి 2003లో శ్రీవినాయక గ్రామలక్ష్మి సంఘంలో చేరింది. టైలరింగ్ పనిచేస్తూ, చౌడేపల్లెలో ఉంటూ, నెలనెలా సక్రమంగా పొదుపుసొమ్ము, అప్పు చెల్లింపు చేస్తోంది. ఆమె పొదుపు పరంగా రూ.20,150 ఆదా చేసింది. ఇటీవల సంఘమిత్ర పద్మ ఎలాంటి సమాచారం ఇవ్వకుండా భారతిని తొలగించి, ఆమె స్థానంలో పి.భవానిని చేర్చారు. కాగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో ఇటీవల కాలంలో 50079090694 ఖాతానెంనంబరుతో రూ.10.50 లక్షల లింకేజీ లోను పొందారు. ఎంసీపీ రికార్డులో గత నెల 19న ఇచ్చిన రికార్డుల్లో తన పేరు ఉన్న చోట పెన్నుతో భవానిగా నమోదు చేయించారని, తన ఆధార్ నంబరు, ఖాతా నంబరు, తండ్రి పేరు మార్పు చేయకుండానే తన పేరిట రూ.1.50 లక్షల లోను పొందారని భారతి తెలుసుకుంది. తనకు సొమ్ము ఇవ్వకుండా సంఘమిత్రకు అనుకూలమైన భవానికి లోను సొమ్ము ఎలా మంజూరు చేస్తారని భారతి ప్రశ్నిస్తోంది. ఈ ఉదంతంపై బ్యాంకు అధికారులు, వెలుగు సిబ్బందిపై డీఆర్‌డీఏ పీడీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. దీనిపై వెలుగు ఏపీఎం శ్రీనివాసులు వివరణ కోరగా..భారతికి చెల్లించాల్సిన పొదుపు సొమ్ము అందేలా చూస్తామన్నారు. మరొకసారి సంఘ సభ్యులతో సమావేశమై పరిష్కరిస్తామని చెప్పారు.

దుర్గాదేవిగా బోయకొండ గంగమ్మ



హోమ పూజలు చేస్తున్న ఉభయదారులు

చౌడేపల్లి: దసరా మహోత్సవాల్లో 8వ రోజైన మంగళవారం బోయకొండ గంగమ్మ ఆదిపరాశక్తి దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉగ్రరూపంతో ఒక చేతిలో ఖడ్గం, మరో చేతిలో త్రిశూలం, గదను చేతబట్టి, శత్రు సంహారం చేస్తున్నట్టు, అలాగే పట్టు పీతాంబరాలు, పరిమళ భరిత పుష్పాలు, స్వర్ణాభరణాలతో అలంకరించి కొలువుదీర్చారు. కోర్కెలు ఫలించిన భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఈఓ ఏకాంబరం, ఉభయదారులతో అమ్మవారికి ప్రత్యేక హోమ పూజలు చేశారు.

మహాకాళి అవతారంలో మలాలమ్మ

గంగవరం: మండలంలోని మేలుమాయి క్రాస్ వద్ద ఉన్న శ్రీమలాలమ్మ (చాముండేశ్వరి దేవి) నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 7వ రోజు మంగళవారం దుర్గాదేవి(మహాకాళి) అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. అలాగే, పలమనేరు రూరల్ నక్కపల్లెలో బోయకొండ గంగమ్మను విశేషంగా అలంకరించి పూజలు చేశారు. పలమనేరులోని పాతపేటలో సత్యగంగమ్మ..దుర్గామాతగా భక్తులకు దర్శనమిచ్చారు.

కరుణచూపమ్మా..దుర్గమ్మా..!

బైరెడ్డిపల్లె: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం, సల్లాపురెమ్మ ఆలయం, బాటగంగమ్మ ఆలయాల్లో అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

దుర్గాదేవిగా కాళికాదేవి

పెద్దపంజాణి: మండలంలో శివాడిలోని కాళికాదేవి మంగళవారం దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అర్చకులు బసవరాజు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి పండ్లతో నైవేద్యాలు సమర్పించారు. కుంకుమార్చన, చండీహోమం, మహా మంగళహారతి పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసి అన్నదానం చేశారు.

అమ్మవార్లకు ప్రత్యేక అలంకారం

పుంగనూరు: పట్టణంలోని శ్రీ భోగనంజుడేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం పార్వతిదేవిని దుర్గాదేవిగా, కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి దుర్గాదేవి, బస్టాండ్‌లోని విరూపాక్షి మారెమ్మను వేపాకుతో అలంకరించి పూజలు చేశారు. అలాగే, చదళ్లలోని చౌడేశ్వరిదేవి దుర్గాదేవిగా దర్శనమిచ్చారు.

దుర్గాదేవి అలంకరణలో ముత్యాలమ్మ

రొంపిచెర్ల: స్థానిక ముత్యాలమ్మ మంగళవారం దుర్గాదేవి అలంకరణలో భక్తులను అనుగ్రహించారు. అమ్మవారికి పంచామృతంతో అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఉభయదారులుగా ఫజులుపేటకు చెందిన బాలసుబ్రమణ్యం, జ్యోత్స్న కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

దుర్గాదేవిగా కన్యకా పరమేశ్వరి

పులిచెర్ల(కల్లూరు): కల్లూరులో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా మంగళవారం వాసవీ కన్యకా పరమేశ్వరి దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. ఉభయదారులు ఆమూరి పెద్ద రెడ్డెప్పశెట్టి, భాస్కర శేఖర్, భక్తులు పాల్గొన్నారు.

సదుంలో..

సదుం: మండలంలోని జాంద్రపేట రామలింగ చౌడేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు మహిషాసుర మర్దిని అలంకారంలో, స్థానిక సదుమమ్మ పూల వాహనంపై దుర్గామాత అలంకారంలో దర్శనమిచ్చారు.



దుర్గాదేవి అలంకరణలో బోయకొండ గంగమ్మ



గంగవరం: దుర్గాదేవిగా మలాలమ్మ



పెద్దపంజాణి: శివాడిలో..



పుంగనూరు: వేపాకు అలంకరణలో విరూపాక్షి మారెమ్మ



రొంపిచెర్లలో..



బైరెడ్డిపల్లె: దుర్గాదేవి అలంకరణలో సల్లాపురెమ్మ